క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ : పట్టణంలో జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనుల్లో భాగంగా ఆదివారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కలెక్టరేట్ ఏరియా, అలకాపురికాలనీ, హైటెక్ కాలనీ, మహిళా ప్రాంగణం, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు అందుకు సహకరించాలని కోరారు.

ఎంపీడీఓకు వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

మునుగోడు : దళితులకు మూడు ఎకరాల భూపంపిణీలో భాగంగా తమకు ఇచ్చిన ప్రభుత్వం భూమికి దారిలేదని, తమకు పక్కా దారిని చూపించాలని కోరుతూ ఎంపీడీఓ జానయ్యకు మండలంలోని కిష్టాపురం లబ్ధిదారులు వినతిపత్రం అందించారు. శనివారం ఆయన ఆ గ్రామంలోని పలు అభివృద్ధి పనుల పరిశీలనకు వచ్చిన సందర్భంగా తమకు భూమి ఇచ్చి దారి కేటాయించకపోవడంతో పంటల సాగుకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని వారు ఎంపీడీఓకు విన్నవించుకున్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, బోయ లింగస్వామి, లబ్ధిదారులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సుధాకర్‌నాయక్

మర్రిగూడ : మండలంలోని కుదాభక్షపల్లి గ్రామ పరిధిలో గల సాయిబండాతండాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన నిధులతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను శనివారం గ్రామసర్పంచ్ ఆంబోతు సుధాకర్ నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నకిరేకల్ : ఈనెల 10న మిలియన్ మార్చ్ కొనసాగించి, తెలంగాణ బచావో సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ జన సమితి నియోజకవర్గ కన్వీనర్ పులి పాపయ్య కోరారు. శనివారం పట్టణంలో మిలియన్ మార్చ్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సాతిరు యాదయ్య, గడుసు శ్రీనివాస్‌రెడ్డి, ఎరుకుల మల్లేష్‌గౌడ్, సుంకరబోయిన మహేష్, నూక మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి

కేతేపల్లి : కేంద్ర ప్రభుత్వ పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు నకిరెకంటి మంగమ్మ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఏడాదికి నాలుగు సార్లు గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డివిరుస్తుందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలన్నారు.

బస్టాండ్‌లో పారిశుద్ధ్య పనులు



సిబ్బందితో చెత్త తొలగింపజేస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు

సాక్షి ఎఫెక్ట్..

మర్రిగూడ : మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మౌలిక వసతులు లేకపోవడంతో సాక్షి దినపత్రికలో గురువారం 'బస్టాండ్‌లో వసతులు కరువు' అనే కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు శనివారం పంచాయతీ కార్మికులతో బస్టాండ్ ఆవరణలో చెత్తను తొలగింపజేశారు. వేసవికాలంలో ప్రయాణికుల అవసరాల దృష్ట్యా తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి యూసుఫ్‌కు సూచించారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి నిరుపయోగంగా మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. దీంతో ప్రయాణికులతో పాటు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు

- శిథిలావస్థలో నీటితొట్లు
- తాగునీటికోసం మూగజీవాల అవస్థలు
- పట్టించుకోని పంచాయతీ పాలకవర్గాలు, అధికారులు



ఉప్పలపహాడ్‌లో చెత్తకుండిలా మారిన నీటితొట్టి



కొప్పోలులో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

కేతేపల్లి : ప్రభుత్వం వేసవిలో పశువుల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో గ్రామాల్లో నిర్మించిన నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. వాటిని నిర్మించిన కొద్దికాలం వరకు నిర్వహణ సక్రమంగా చేపట్టిన పాలకులు ప్రస్తుతం వాటిని పట్టించుకోకపోవడంతో మండలంలోని వివిధ గ్రామాలలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన నీటితొట్లు అలంకారప్రాయంగా మారాయి. గ్రామపంచాయతీల నిర్వహణ లోపం, అధికారుల అలసత్వం కారణంగా తొట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో దాహార్తిని తీర్చుకునేందుకు మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. పశు పోషకులు చేతిపంపులు, వ్యవసాయ బావుల వద్దకు పశువులను తీసుకెళ్లి దాహం తీర్చేందుకు అవస్థలు పడుతున్నారు.

వివిధ గ్రామాల్లో 70నీటితొట్లు..

కేతేపల్లి మండలంలో 16గ్రామపంచాయతీలతో పాటు ఐదు శివారులో గ్రామాల పరిధిలో పశుగణన లెక్కల ప్రకారం ఎద్దులు, ఆవులు 2720, గేదెలు 10001, గొర్రెలు 67281, మేకలు 5984 వరకు ఉన్నాయి. మండలంలో 80శాతం మంది ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తారు. ఆయా గ్రామాల్లో మూగజీవాల దాహార్తిని తీర్చే లక్ష్యంతో 2009 నుంచి 2017 వరకు ఉపాధిహామీ, వాటర్‌షెడ్ తదితర పథకాల కింద సుమారు 70వరకు నీటితొట్లు నిర్మించారు. ఒక్కో నీటితొట్టి నిర్మాణానికి రూ.17వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చు చేశారు. గ్రామం నుంచి ఉదయం మేతకు వెళ్లేటప్పుడు, తిరిగి ఇంటికి చేరేటప్పుడు పశువులు నీటిని తాగేందుకు వీలుగా గ్రామశివార్లలో వ్యవసాయ భూముల వద్దకు వెళ్లే దారుల వద్ద వీటిని నిర్మించారు. కొన్నాళ్లు వాటి నిర్వహణ బాగానే ఉన్నా తర్వాత నిర్వహణ లోపంతో శిథిలావస్థలకు చేరాయి. వాటి నిర్వహణ బాధ్యతలను గ్రామపంచాయతీలు నిర్వహించాల్సి ఉంది. చాలా చోట్ల పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు నీటితో తొట్లు నింపాల్సి ఉండగా అలాంటి చర్యలేమి చేపట్టడం లేదు. దాదాపు సగం తొట్ల వద్ద నీటి వసతి లేనేలేదు. ఉన్నచోట బోరు మోటార్లు కాలిపోయి, నల్లా పైపులైన్‌లు పగిలిపోయాయి ఉన్నాయి. దీంతో పశువుల నీటితొట్లు పనికిరాకుండా పోతున్నాయి. ఏళ్ల తరబడి నుంచి నిర్వహణను పట్టించుకోకపోవడంతో పలు చోట్ల శిథిమైపోగా, మరికొన్ని పిచ్చిమొక్కలు, చెత్త, చెదారంతో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం విపరీతమైన ఎండలు ప్రారంభం కావడంతో మేతకు వెళ్లి వచ్చే పశువులకు నీరులేక అలమటిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటితొట్లకు మరమ్మతులు చేట్టి అందుబాటులోకి తీసుకరావాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

తొట్ల వద్ద నీటిసౌకర్యం కల్పించాలి



గ్రామంలో సుమారు 200కుటుంబాలకు పైగా మూగజీవాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాం. వేసవి ప్రారంభం కావడంతో ఎండలు ఎక్కువ అవుతున్నాయి. పదేళ్ల కిత్రం నిర్మించిన నీటితొట్లు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. తొట్ల వద్ద నీటిసౌకర్యం కల్పించి అందుబాటులోకి తీసుక వస్తే మూగజీవాల దాహార్తి తీరుతుంది.

– జటంగి వెంకన్న, రైతు, కేతేపల్లి

నిర్వహణ గ్రామపంచాయతీలదే



నీటితొట్లలో ప్రతిరోజు నీటిని నింపే బాధ్యత పంచాయతీ అధికారులు, పాలకులు చూసుకోవాలి. పంచాయతీల వారీగా నీటితొట్ల వివరాలను సేకరిస్తున్నాము. చిన్నచిన్న మరమ్మతుల కారణంగా నీటితొట్లు నిరుపయోగంగా ఉన్నగ్రామాల్లో సిబ్బందిని అప్రమత్తం చేశాము. వేసవిలో మూగజీవాలకు నీటి సమస్య లేకుండా వాటి దాహార్తిని తీర్చేందుకు చర్యలు చేపడతాం.

– రమేష్ దీన్‌దయాల్, ఎంపీడీఓ, కేతేపల్లి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : విద్యార్థులు కష్టపడి ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని దేవరకొండ రోడ్‌లో గల ఐఎంఎస్ హైస్కూల్ కల్చరల్ ఫీస్ట్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను ఉపాధ్యాయులు భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రేగట్టే మల్లిఖార్జున్‌రెడ్డి, సీఐ ఆదిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ రమేష్‌గౌడ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్లు అలక జానకిరామ్ రెడ్డి, లక్ష్మారెడ్డి రమణారెడ్డి, జానకిరెడ్డి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రికి రజక సంఘం నాయకుల సన్మానం



మంత్రిని సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న రజక సంఘం నాయకులు

నల్లగొండ : తెలంగాణ ప్రభుత్వం రజకుల ఆర్థికాభివృద్ధి కోసం ఉమ్మడి జిల్లాకు 19ఆధునిక ధోబీఘాట్లు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా రజక సంఘాల నాయకులు శనివారం పట్టణంలో మంత్రి జగదీశ్‌రెడ్డిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మల్లిఖార్జున్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, తెలంగాణ రజక సంఘాల సమితి చీఫ్ అడ్వైజర్ కొండూరు సత్యనారాయణ, చిలుకరాజు చెన్నయ్య, రాములు, సైదులు, సత్తయ్య, వెంకన్న ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని, ఎవరూ పార్టీని వీడి వెళ్లొదని టీపీసీసీ నాయకుడు దైద రవీందర్ కోరారు. శనివారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని నియోజకవర్గంలో బలహీన పర్చేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని, వారి ఆటలు సాగవని అన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుఖాయమన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న దుబ్బాక నర్సింహారెడ్డి

నల్లగొండ : ప్రస్తుతం మారుతున్న సమాజంలో గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో కాంగ్రెస్ మహిళా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోలాటం, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ కళలు మానసిక ప్రశాంతతతో పాటు, ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడతాయన్నారు. నేటి ఆధునిక కాలంలో గ్రామీణ కళలు అంతరించిపోయే ప్రమాదం ఉందని, ప్రతిఒక్కరూ వాటిపట్ల అవగాహన పొందాలన్నారు. నియోజకవర్గం నుంచి సుమారు 70టీమ్‌ల కళాబృందాలు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన టీమ్‌లకు పారితోషికం అందిస్తామన్నారు. నాలుగురోజులపాటు కోలాటం, ముగ్గులకు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు ఈనెల 8న మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీ సుమన్, వైస్‌ఎంపీపీ పరమేష్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ సరస్వతీ, ఎంపీటీసీ రత్నమాల, భాగ్య, హారతిరెడ్డి, అప్సర్, అరుణారెడ్డి, సునీత, జయమ్మ, మాజీ కౌన్సిలర్ కవిత, కౌన్సిలర్ బొజ్జ శంకర్, అల్లి సుభాష్‌యాదవ్, చిన్నాల జానయ్యయాదవ్, గణేష్, లింగస్వామి, జాన్‌రెడ్డి, పనస శంకర్, నర్సింహ, పాండు, రాజు, కోటయ్య కళాకారులు పాల్గొన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలని ధర్నా



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ : అనర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించారని వాటిని వెంటనే రద్దు చేసి వెంటనే అర్హులైన వారికి ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. డబుల్ బెడ్ రూం పంపిణీలో జరిగిన అవకతవకలకు నిరసనగా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని, డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపిక కోసం తీసిన డ్రాలో అధికార పార్టీ నాయకులకు సంబంధించిన వారి పేర్లే వచ్చాయని, వాటిని రద్దు చేసి అర్హులైన లబ్ధిదారులకు డబుల్ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో 14వేల దరఖాస్తులు వస్తే వాటిని సరైన పద్ధతిలో స్క్రూటినీ చేయకుండా ఇష్టారీతిగా వ్యవహరించి అనర్హులకు లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. ధర్నాలో పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు ఓరుగంటి రాములు, పట్టణ అధ్యక్షుడు మొరిశెట్టి నాగేశ్వర్‌రావు, బొజ్జ నాగరాజు, నాగిరెడ్డి, గుర్రం వెంకన్న, గణేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీడీపీఓ లావణ్యకుమారి

మర్రిగూడ : మండలంలోని తిరగండ్లపల్లి జెడ్పీ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు లింగ సమానత్వంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఐసీడీఎస్ సీడీపీఓ లావణ్యకుమారి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా 3సంవత్సరాలు నిండిన చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా మహిళా వార్డుసభ్యులను, మహిళా ఉపాధ్యాయులను, అంగన్‌వాడీ టీచర్లను గ్రామసర్పంచ్ ఐతపాక జంగయ్య సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద, వార్డుమెంబర్ మామిడి భారతమ్మ, హెచ్ఎం శ్రీరమణ, ఉపాధ్యాయురాలు పార్వతమ్మ, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి, నిర్మల, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య

కట్టంగూర్ : ప్రతికుటుంబం ఇంకుడు గుంతను నిర్మించుకొని భూగర్భ జలాలను పరిరక్షించాలని ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మూడో రోజు జరిగిన స్వచ్ఛభారత్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను నిర్మించుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికినీరు నిల్వఉండకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఎండీ మెహినుద్దీన్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చలపతి, ఎంపీఓ అథర్‌పర్వేజ్, ఏపీఓ రాంమోహన్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

వైభవంగా పదహారు రోజుల పండగ



శివాలయంలో పూజలు చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు

కేతేపల్లి : మండలంలోని ఇనుపాముల శివాలయంలో శ్రీపచ్చల పార్వతీ సోమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం పదహారు రోజుల పండగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి వేణుశర్మ ఆధ్వర్యంలో శివాలయంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో పలువురు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాల వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కానుగు యాదగిరి, ధర్మకర్తలు, భక్తులు పాశం లలిత ప్రభాకర్‌రెడ్డి, బత్తుల సత్యనారాయణరెడ్డి, నిరంజన్, సంజీవరెడ్డి, వేణుమాధవరెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకన్న, సైదులు, బాలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



రామగిరి : న్యూస్ స్కూల్‌లో విద్యార్థులతో యానాల ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, ఉపాధ్యాయులు



నార్కట్‌పల్లి : ఎస్పీఆర్ పాఠశాలలో..

రామగిరి (నల్లగొండ) : పట్టణంలోని న్యూస్ స్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రస్మా జిల్లా గౌరవ అధ్యక్షుడు యానాల ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల పాత్రలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రస్మా పట్టణ అధ్యక్షుడు ఎండీ.అజీజ్, పాఠశాల చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, ప్రిన్సిపాల్ అలుగుబెల్లి తిరుమల్‌రెడ్డి, స్పందన, ఫాతిమా, పర్వత్‌రెడ్డి, లక్ష్మణ్, నగేష్, స్వామి, లింగయ్య, జ్యోతి పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశాలలో విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్‌లు విష్ణుమూర్తి, ఉపేందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొండల్‌వాయి ప్రాథమిక పాఠశాలలో..

మండల పరిధిలోని తొండల్‌వాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ బెల్లి గోపాల్, ఉపాధ్యాయులు రహిమున్నీసాబేగం, వెంకన్న, సత్యనారాయణ ఉన్నారు.

చిట్యాల : మండలంలోని తాళ్లవెల్లెంల, వెలిమినేడు, వనిపాకల గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలో, గుండ్రాంపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో, వెలిమినేడులోని విజయవాణి విద్యానికేతన్ పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా విధులు నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో తాళ్లవెల్లెంల గ్రామ సర్పంచ్ జనగాం రవీందర్‌గౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ జోగు లావణ్య లింగస్వామి, హెచ్ఎం ఎన్.సైదులు, వెలిమినేడులో సర్పంచ్ దేశబోయిన మల్లమ్మ పాపయ్య, ఎంపీటీసీ దేశబోయిన స్వరూప నర్సింహ, ఎస్ఎంసీ చైర్మన్ కొరగోని రామచంద్రం, హెచ్ఎం నామాల లింగయ్య, గుండ్రాంపల్లిలో సర్పంచ్ రత్నం పుష్పనర్సింహ, ఎంపీటీసీ దుబ్బ పద్మ కుమారస్వామి, హెచ్ఎం నర్సింగరావు, వెలిమినేడులోని విజయవాణి విద్యానికేతన్ స్కూల్ ప్రిన్సిపాల్ వలిగొండ శంకర్, కరస్పాండెంట్ అర్రూరీ రాజు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల బాలికల ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ ప్రేమలత, హెచ్ఎం అనీత, ఉపాధ్యాయులు కవిత పాల్గొన్నారు.

సరస్వతీ పాఠశాలలో..

పట్టణంలోని శ్రీ సరస్వతీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారుపాక నర్సయ్య, ప్రిన్సిపాల్ యూసఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల జీపీ పరిధి మార్తవారిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుగా ఎంపికైన వారికి పాఠశాల హెచ్ఎం ఎస్‌కే సఫియా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బెల్లి మహాలక్ష్మిసుధాకర్, విద్యాకమిటీ చైర్మన్ శివశంకర్, ఉపాధ్యాయులు చంద్రకళ, పద్మశ్రీ, విద్యార్థులు ఉన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పాండుగౌడ్, ఉపాధ్యాయులు జాజాల రామకృష్ణ, మోర యాదయ్య, కొడాల రాజ్యలక్ష్మి, మౌనిక, స్వాతి, రాఘవేందర్, ప్రేమలత, బాబు పాల్గొన్నారు.

శాలిగౌరారం : మండలంలోని ఆకారం ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నకిరేకల్ : చందుపట్ల ప్రాథమిక పాఠశాలలో..



కట్టంగూర్ : మార్తవారిగూడెం పీఎస్‌లో..



మర్రిగూడ : గాయత్రి పాఠశాలలో..



చిట్యాల : వెలిమినేడు పాఠశాలలో..

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

నాంపల్లి : మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించాలని ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేతా అన్నారు. శనివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్వేత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా సమావేశంలో వైద్య, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖలపై సమీక్ష నిర్వహించారు. గత సభలో చేసిన తీర్మాణాలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని, తీర్మాణాలకే పరిమితం చేసే సభలు నిర్వహించినా ఫలితం ఉండదని పలువురు ప్రజాప్రతినిధులు వాపోయారు. సమావేశంలో తహసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ శేషుకుమార్, మండల వైద్యాధికారి సయ్యద్ ఇ క్బాల్, విద్యాధికారి గురువరావు, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీటీ రోడ్లుగా మార్చాలి



రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామం నుంచి వెల్లంకి, సిరిపురం గ్రామాల లింకురోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. శనివారం వెలిమినేడు – వెల్లంకి, సిరిపురం గ్రామాల లింకురోడ్డును ఆయన సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి అర్రూరీ శ్రీను, నాయకులు నెల్లికంటి నర్సింహ, గ్రామ కార్యదర్శి పంది నరేష్, అర్రూరీ శంభయ్య, నర్సింహ, బసవయ్య, నర్సిరెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రణీత్ పాల్గొన్నారు.

పేదలపై భారం మోపుతున్న మోదీ ప్రభుత్వం

మిర్యాలగూడ: గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేదలపై పెనుభారం మోపుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శనివారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో అద్దంకి –నార్కట్‌పల్లి రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచుతుండడంతో పేద ప్రజలు బతికే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, శేఖర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్ : నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శనివారం రాత్రి హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారని ఆయన అన్నారు.

టీడీపీ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి

మర్రిగూడ : టీడీపీ పాలనలో తెలంగాణ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని, పేదవర్గాలకు అండగా టీడీపీ ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నాడు చేపట్టిన అభివృద్ధి పనుల కరపత్రాలను ప్రజలకు అందజేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ప్రజలు ఆదరిస్తారని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మక్కాని అప్పారావు, మండల కన్వీనర్ దోమల వెంకటయ్య, రావుల ఆంటోని, మొగుదాల పార్వతమ్మ, పగడాల లింగయ్య, పుప్పాల యాదయ్య, ముద్దం శ్రీనివాస్‌గౌడ్, సుగుణమ్మ, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.